మోగనున్న పెళ్లి బాజాలు



ఆకట్టుకునేలా వేదిక

ఆషాఢం ముగిసింది.. శ్రావణం వచ్చేసింది.. ఇక అంతా శుభమే.. ఎటు చూసినా సందడి వాతావరణం కనిపిస్తోంది. శుక్రవారం నుంచి ఆలయాలు శ్రావణ శోభ సంతరించుకున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు, పూజలు, అర్చనలు, అభిషేకాలు మొదలయ్యాయి. ఇదంతా ఒక ఎత్తయితే.. పెళ్లిళ్లకు మంచి ముహుర్తాలు కూడా ఈ నెలలోనే ఉండడంతో బాజాలు మోగించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో పెళ్లి మండపాలకు డిమాండ్ ఏర్పడింది. అనుబంధ వ్యాపారాలు ఊపందుకోనున్నాయి.

- పెదగంట్యాడ



పూల మండపం



మూఢం కారణంగా సుమారు 48 రోజుల పాటు శుభకార్యాలు లేవు. దీంతో అన్ని వ్యాపారాలు వెలవెలబోయాయి. ప్రస్తుతం శ్రావణం రావడంతో కొత్త ఉత్సాహం వచ్చినట్టయింది. భూమి పూజలు, గృహ ప్రవేశాలు, పెళ్లిళ్లకు పెద్ద ఎత్తున ముహూర్తాలు పెట్టుకుంటున్నారు.

పురోహితులకు డిమాండ్

శ్రావణ మాసంలో వివాహాలు, నూతన గృహ ప్రవేశాలు, దుకాణాల ప్రారంభోత్సవాలు తదితర కార్యక్రమాలకు శుభ ముహూర్తాలు ఉండడంతో పురోహితులకు డిమాండ్ పెరిగింది. చాలా మంది అడ్వాన్స్ బుకింగ్‌లు చేసుకుంటున్నారు.

ఇవీ మంచి ముహూర్తాలు..

శ్రావణ మాసం ప్రారంభమైన మరుసటి రోజు నుంచే మంచి ముహూర్తాలు మొదలయ్యాయని పండితులు చెబుతున్నారు. జూలై 26, 30, 31, ఆగస్టులో 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13, 14, 17వ తేదీ వరకూ ముహూర్తాలు ఉన్నాయి. సెప్టెంబర్‌లో 23, 24, 26, 27, 28 తేదీల్లో పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. అలాగే అక్టోబర్ 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 16, 17, 22, 23, 24, 26, 28, 29, 30, 31 తేదీల్లోన్నూ, నవంబర్‌లో 1, 2, 4, 7, 12, 13, 14, 15, 22, 23, 25, 26, 27 తేదీల్లో వివాహాది శుభ కార్యాలకు మంచి ముహూర్తాలని.. నవంబర్ దాటితే మళ్లీ 2026 ఫిబ్రవరిలోనే మూహూర్తాలని పండితులు చెబుతున్నారు..

డ్రోన్ ఫొటో గ్రఫీకి క్రేజ్

ప్రస్తుతం డ్రోన్ ఫొటోగ్రఫీ, వీడియోలకు మంచి గిరాకీ పెరిగింది. ఆకాశం నుంచి అత్యంత క్వాలిటీతో ఫొటోలు, వీడియోలు తీయడం ఈ ఫొటోగ్రఫీ విశిష్టత.. ఈ విధానానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

పెళ్లి మండపాలు ముందుగానే బుకింగ్స్ మండలంలోని సుమారు 50 వరకూ ఉన్న పెళ్లి మండపాలకు డిమాండ్ పెరిగింది.వాహనాల పార్కింగ్,విశ్రాంతి గదులతో పాటు ఏసీ కల్యాణ మండపాలకు మరింత డిమాండ్ ఉంది. అందులోనే డెకరేషన్, కేటరింగ్, లైటింగ్ తదితర సదుపాయాలు ఉండడంతో పెళ్లిళ్లను అందులోనే చేసుకోవడానికి ఎక్కువగా జనం ఆసక్తి చూపిస్తున్నారు. చిన్న చిన్న మండపాలకు రోజుకు రూ.15 వేల నుంచి 20 వేలు ఉండగా.. ఏసీతో పాటు అన్ని సౌకర్యాలు ఉన్న కన్వెన్షన్ హాల్స్‌కు రూ. 60 వేల నుంచి రూ.2 లక్షలు వరకూ ఉన్నాయి.ఇప్పటికే దాదాపుగా అన్ని ఫంక్షన్ హాళ్లను బుక్ చేసుకున్నారు.

విందుకు ప్రాధాన్యం

ట్రెండ్ మారింది. గతంలో మాదిరిగా కాకుండా విందుకు ఇప్పుడు ప్రాధాన్యం ఇస్తున్నారు. భోజనాలు రుచితో పాటు శుచిగా అందించేందుకు ఎంతైనా ఖర్చు చేస్తున్నారు. బంధుమిత్రులలో మాట రాకూడదని భావిస్తున్నారు. ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనాల వరకు ఆహార పదార్థాలను సరఫరా చేసే కేటరింగ్‌కు ఆర్డర్లు ఇచ్చేస్తున్నారు. మెనూ ప్రకారం ధరలు నిర్ణయిస్తారు. ఎంచుకునే పదార్థాల ప్రకారం.. ప్లేటు రూ.150 నుంచి రూ.1000 వరకూ ఉంటోంది.

బంగారం ధర పెరిగినా..

మార్కెట్లో బంగారం ధర రోజు రోజుకు పెరుగుతున్నా ఆదరణ మాత్రం తగ్గడం లేదు.. పెళ్లి ముహూర్తాలు కూడా ఎక్కువగా ఉండడంతో బంగారానికి కూడా డిమాండ్ పెరుగుతోంది.

ప్రత్యేక వంటకాలు



పెళ్లిళ్ల సీజన్ వస్తే చాలు రకరకాల వంటకాలతో సిద్ధం కావాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కొత్త రుచులు అందించాలి. శాకాహారంలో ప్రత్యేక వంటకాలను తయారు చేస్తున్నాం. ఇప్పటికే పలువురు పెళ్లిళ్ల కోసం ఆర్డర్లు ఇచ్చారు.

–కిల్లాన మునలయ్య, కేటరింగ్, పెదగంట్యాడ

శ్రావణం నుంచి మంచి ముహూర్తాలు



ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి పుణ్యకాలం ప్రారంభమైంది. శుక్రవారం నుంచి శ్రావణం మాసం ప్రారంభం కావడంతో వివాహాది శుభకార్యాలకు అనుకూలంగా ఉంది. ఒక్క బాద్రపద మాసం మినహాయిస్తే శ్రావణం మొదలు నవంబర్ వరూబలమైన ముహూర్తాలు ఉన్నాయి. అందులోనూ ఈ ఏడాది మంచి ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి.

–బంకపల్లి వాసుదేవ శర్మ, పండితుడు,పురోహితుడు పెదగంట్యాడ

క్లుప్తంగా

ధర్మస్థలి నేరస్తులను శిక్షించాలి



ధర్నాలో పాల్గొన్న మహిళలు

గాజువాక: ధర్మస్థలిలో మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త గాజువాక జంక్షన్‌లో శనివారం నిర్వహించిన ధర్నాలో సమాఖ్య అధ్యక్షురాలు వనజాక్షి మాట్లాడుతూ ధర్మస్థలిలో మహిళలపై జరుగుతున్న దారుణాలపై కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే కారకులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు ఎం.ఎ.బేగం, బి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతపై అవగాహన



యూత్ ఎంపవర్ మెంట్ స్కిల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

అగనంపూడి: మానసిక ఆరోగ్యంతో పాటు సామాజిక బాధ్యత ప్రాధాన్యాన్ని గుర్తు చేయాలన్న లక్ష్యంతో యూత్ ఎంపవర్‌మెంట్ స్కిల్ డెవలప్‌మెంట్ (వైఈఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించామని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి అన్నారు. జగ్గరాజుపేటలోని కళాశాలలో వైఈఎస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సామాజిక బాధ్యత, వ్యక్తిగత, మానసిక ఆరోగ్యం విషయంలో ఈ క్లబ్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని అగనంపూడికి చెందిన గురు కృష్ణ చైతన్య అనేదాత రూ.లక్ష116విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాన్ని సింహగిరిపై ఉన్న పీఆర్‌వో కార్యాలయంలో నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ప్రోటోకాల్ విభాగం పర్యవేక్షకుడు విక్రమ్ బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలు నిర్వీర్యం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి

సీతంపేట: ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా రూపొందించిన చట్టాలు రోజురోజుకూ నిర్వీర్యమవుతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం జరిగిన దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) జిల్లా ఐదో మహాసభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. పోరాటాలతోనే ఎస్టీ, ఎస్సీ అత్యాచార నిరోధక చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. దానితోపాటు ఇప్పుడున్న చట్టాలను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లోకి చేర్చాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. సీపీఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ రాజ్యాంగం మీద నమ్మకం లేని వారు దేశాన్ని పాలిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగంలో లౌకికవాదం, సామ్యవాదానికి బి.ఆర్.అంబేడ్కర్ పెద్దపీట వేశారని, ఆ రెండింటినీ తొలగించే కుట్ర నేడు జరుగుతోందన్నారు. 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ మాట్లాడుతున్నారని.. అందుకే ప్రజలు 240 సీట్లకే పరిమితం చేశారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో దళితులపై దాడులు జరుగుతున్నా స్పందించడం లేదన్నారు. డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజులు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వి.ప్రభాకర్, కె.సుబ్బారావు, రామారావు, బొడ్డు కల్యాణరావు, ప్రొఫెసర్లు అర్జున్, సూరప్పడు పాల్గొన్నారు.

పూర్తి జీతాలు చెల్లించాలని ధర్నా



స్టీల్‌ప్లాంట్ ఎల్‌డీసీ కూడలి వద్ద ధర్నా చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఉద్యోగులకు పూర్తి జీతాలు చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలపై యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఉక్కు ఎల్‌డీసీ విభాగం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు సరిగా లేకపోయినా యాజమాన్యం ఇచ్చిన 7.3 మి.ట లక్ష్యం కోసం ఉద్యోగులు అనేక ఇబ్బందులను అధిగమించి ఉత్పత్తి కొనసాగిస్తున్నారన్నారు. అయినా యాజమాన్యం ఉద్యోగులకు 305 శాతం జీతం పెండింగ్‌లో పెట్టిందన్నారు. వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలన్నారు. గతేడాది నిలిపి వేసిన హెచ్‌ఆర్‌ఏను పునరుద్ధరించాలని.. పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్, చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎస్ఈ శ్యాంబాబు

గాజువాక:విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై రాయితీతో కూడిన సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకోవచ్చని ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.శ్యాంబాబు అన్నారు. 72వ వార్డు మెహర్‌నగర్‌లో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకం ద్వారా ఇంటి యజమానులకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. దీన్ని ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ బిల్లు ఆదా అవుతుందన్నారు. సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు బ్యాంకులు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, ఈఈ బి.కె.నాయుడు, డీఈ పార్థసారధి, ఏఈ ఆర్.వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కండి



మహాసభల్లో మాట్లాడుతున్న అజశర్మ



సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు పిలుపు
- ఘనంగా సిటు జిల్లా 13వ మహాసభలు

కంచరపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. కంచరపాలెంలోని ఒక కమ్యూనిటీ హాలులో శనివారం సీఐటీయూ విశాఖ జిల్లా 13వ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు.. మోదీ విధానాలను శరవేగంగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాజధాని నిర్మాణానికి మరో 40 వేల ఎకరాల భూమిని బలవంతంగా సేకరించడం దారుణమన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనాలు రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రజా విధానాలపై వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేసే మరిన్ని పోరాటాలకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లను, సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని తీర్మానం చేశారు. అంతకుముందు సీఐటీయూ పూర్వ జిల్లా అధ్యక్షుడు వి.ఎస్.పద్మనాభరాజు సిటు పతాకావిష్కరణ చేశారు. ప్రజానాట్య మండలి కళాకారులు కార్మికులను ఉత్తేజపరుస్తూ అభ్యుదయ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఎ.అజశర్మ, కె.లోకనాథం, ఆర్.శంకరరావు, ఎం.శ్రీనివాస్, పి.మణి, పి.వెంకటరెడ్డి, ఎం.సుబ్బారావు, ఎల్.జె.నాయుడు, వై.సత్యవతి, చిరంజీవి, ఎం.చంటి, తదితరులు పాల్గొన్నారు.

'ఆది కర్మయోగి' శిక్షణ పూర్తి



ఆది కర్మయోగి శిక్షణ పూర్తి చేసుకున్న నాలుగు జిల్లాల అధికారులు

తాటిచెట్లపాలెం: గిరిజన ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఆది కర్మయోగి' కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. గిరిజన గ్రామాభివృద్ధి దిశగా ప్రజల్లో చైతన్యం పెంచేందుకు రూపొందించిన ఈ కార్యక్రమంలో భాగంగా, విశాఖలోని బెస్ట్ వెస్టన్ హోటల్‌లో ఈ నెల 23న ప్రారంభమైన రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని పూర్తి చేసుకున్న జిల్లాల అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు చిత్తశుద్ధితో 'ఆది కర్మయోగి' కార్యక్రమ లక్ష్యాలను సాధించే దిశగా వివిధ శాఖల సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులను, శిక్షణ అందించిన రిసోర్స్ పర్సన్‌లను అభినందించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు పీవీఎస్ నాయుడు, పి. మురళీధర్, డాక్టర్ ఎం. రమేష్ బాబు, ఎస్.వై. నూరాని, కె.సురేష్ బాబు, పి.వనజ, ఎం. ఉమాపతిలతో పాటు డాక్టర్ ఆర్. కృష్ణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యభివృద్ధి సంస్థ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వర రావు తెలిపారు. ఇందు కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లమో, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 40 ఏళ్ల వయసు గల వారికి మూడు నెలల పాటు సర్టిఫికెట్ ఆధారిత శిక్షణ ఉంటుందని వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు మరింత సమాచారం కోసం స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ బలివాడ సౌజన్యను 90147 66143 నంబరులో సంప్రదించవచ్చు.

డాక్‌యార్డులో కొత్త అగ్నిమాపక కేంద్రం



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్‌యార్డ్ ఏఎస్‌డీ రియర్ అడ్మిరల్ శ్రీనివాస్

సాక్షి, విశాఖపట్నం : భద్రతా వ్యవస్థను మరింత ఆధునీకరించేందుకు నేవల్ డాక్‌యార్డు నిరంతరం శ్రమిస్తుందని వైజాగ్ డాక్‌యార్డు అడ్మిరల్ సూపరింటెండెంట్(ఏఎస్‌డీ) రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్ తెలిపారు. డాక్‌యార్డులో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించనున్న నూతన అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి ఏఎస్‌డీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కొత్త కేంద్రం అందుబాటులోకి వస్తే.. అత్యంత వేగంగా, మెరుగైన సౌకర్యాలతో అగ్నిమాపక బృందం సేవలు అందించేందుకు వీలవుతుందని రియర్ అడ్మిరల్ శ్రీనివాస్ వెల్లడించారు.

కొనసాగుతున్న శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాద స్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. వివరాలకు 0891–2711725 నంబర్‌లో సంప్రదించవచ్చు.

విశ్రాంత సైనికులకు సత్కారం



సత్కారం పొందిన సైనికాధికారులతో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

సీతంపేట: కళావేదిక కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ 31వ వార్షికోత్సవం శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. భారతీయ సైనికా నీకు వందనం.. అభినందనం శీర్షికన జరిగిన కార్యక్రమంలో వివిధ హోదాల్లో పనిచేసిన 60 మంది విశ్రాంత సైనికులు, సైనికాధికారులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ దేశ భద్రత కోసం సైనికులు అహర్నిశలు దేశ సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉంటూ సేవలందిస్తున్నారని కొనియాడారు. అటువంటి సైనికులను కళావేదిక సత్కరించడం అభినందనీయమన్నారు. కళావేదిక అధ్యక్షుడు డాక్టర్ కమల్‌బైద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి డాక్టర్ సత్యప్రసాద్, విశాఖ మహానగర్ సంఘ చాలక్ పి.వి.నారాయణరావు, కళావేదిక వ్యవస్థాపకులు డాక్టర్ నందూరి రామకృష్ణ, డాక్టర్ బి.రజని పాల్గొన్నారు.

ఆక్రమణల పేరుతో ఇళ్లు కూల్చివేత



వడ్లపూడిలో అధికారులు కూల్చివేసిన ఇళ్లు



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

- లబోదిబోమంటున్న బాధితులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో ఆక్రమణల పేరుతో అధికారులు ఇళ్లు కూల్చేశారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. పాతవడ్లపూడి టీజీఆర్ నగర్‌లో శనివారం ఉదయాన్నే ప్రణాళికా విభాగం అధికారులు రెండు ఇళ్లు కూల్చేశారు. అవి ప్రభుత్వ స్థలంలో ఉన్నాయని.. అనుమతులు లేకుండా నిర్మించారని అధికారులు చెబుతున్నారు. అయితే ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూలగొట్టేశారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం సామగ్రి, వంట దినుసులు కూడా తీసుకోవడానికి అవకాశం ఇవ్వలేదని వారు ఆరోపిస్తున్నారు. కొన్నేళ్లుగా నివాసముంటున్నామని.. చెప్పా పెట్టకుండా పొక్లెయిన్ సహాయంతో అకస్మాత్తుగా కూలగొట్టడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. తమకు రాజకీయ పలుకబడి లేక పోవడం వల్లే అధికారులు ఇటువంటి చర్యలకు ఉపక్రమించారని బాధితురాలు తాడిపూడి జానకమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది కావాలనే కుట్రపన్ని నిలువ నీడ లేకుండా చేశారని ఆమె పేర్కొన్నారు. కాగా ప్రణాళికా విభాగం చర్యలను అనేకమంది తప్పు పడుతున్నారు. కళ్లముందు అక్రమంగా కడుతున్న భారీ భవంతులను పక్కనపెట్టి ఎప్పుడో కట్టిన ఇళ్లను కూల్చివేయడంలో అంతరార్థం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఇళ్లకూల్చివేతపై రకరకాల విమర్శలు వినిపిస్తున్నాయి.

తిరుమలనగర్‌కు స్వచ్ఛతలో అవార్డు



తిరుమలనగర్ వాసులకు అందజేసిన షీల్డు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని తిరుమలనగర్‌కు స్వచ్ఛభారత్‌లో భాగంగా ఆర్‌డబ్ల్యూ ఏ అవార్డు లభించింది. ఈ మేరకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం పెద్దలు అతిథుల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. తిరుమలనగర్‌లో చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమాలతో పాటు భూగర్భజలాలు పెంపొందించడానికి ఇంకుడు గుంతలు తవ్వడం, ప్లాస్టిక్ నిషేధంలో కీలక భూమిక పోషించడంతో అధికారులు ఆర్‌డబ్ల్యూ ఏ విభాగానికి ఎంపిక చేశారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ చేతుల మీదుగా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధి పరందామయ్య ప్రశంసాపత్రం, షీల్డు అందుకున్నారు. కాలనీకి స్వచ్ఛతలో మరోసారి అవార్డు రావడంపై పెద్దలు విశ్వేశ్వరరావు ,అప్పలనాయుడు తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

మరణించి.. మరొకరికి వెలుగునిచ్చి..



కళ్లు దానం చేసిన మృతురాలు మల్లెడి రంగమ్మ (ఫైల్)

మల్కాపురం: మరణం తర్వాత కూడా మరొకరికి వెలుగును పంచింది ఓ మహిళ. మల్కాపురం పల్లి వీధికి చెందిన 74 ఏళ్ల మల్లెడి రంగమ్మ చేసిన ఈ కంటి దానం చేసి ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. అనారోగ్యంతో బాధపడుతున్న రంగమ్మ, కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. తాను బతికే అవకాశాలు తక్కువ అని గ్రహించిన ఆమె, తన కుమార్తె ,అల్లుడికి తన మనసులో మాట వెలిబుచ్చింది. తాను మరణించిన తర్వాత తన శరీరంలోని ఉపయోగపడే అవయవాలను దానం చేయాలని కోరింది. శనివారం ఉదయం రంగమ్మ తుది శ్వాస విడిచారు. ఆమె చివరి కోరికను గౌరవిస్తూ రంగమ్మ రెండు కళ్లను డాక్టర్ ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు.